క్లుప్తంగా

వాగ్దేవి ట్రస్ట్ సేవా కార్యక్రమాలు



దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

పిఠాపురం: పట్టణంలో ఉన్న వాగ్దేవి పీఠం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం సేవా కార్యక్రమాలను నిర్వహించారు. మహాలక్ష్మి ఆలయం వద్ద దివ్యాంగులైన గొల్లప్రోలు మండలం ఏపీ మల్లవరానికి చెందిన అరిగెల రామకృష్ణ, కడిమిశెట్టి సుధాకర్‌లకు ట్రై సైకిళ్లను అందజేశారు. కొత్తపల్లి మండలం నాగులాపల్లికి చెందిన దువ్వాడ శామ్యూల్‌కి వీల్ చైర్, తల్లిదండ్రులను కోల్పోయిన కోనా ఈశ్వర్‌కి చదువు నిమిత్తం ఆర్థిక సాయం చేశారు. ట్రస్ట్ ద్వారా 2014 నుంచి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి ఇంద్రగంటి వెంకట గోపాలకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో పలువురు ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

గేదెను ఢీకొట్టిన కారు



ప్రమాదంలో దెబ్బ తిన్న కారు

పిఠాపురం: పిఠాపురం–కత్తిపూడి రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కారు గేదెను ఢీకొట్టింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కత్తిపూడి నుంచి పిఠాపురం వైపు వస్తున్న కారు భోగాపురం రోడ్డు జంక్షన్ సమీపంలో పొలాల్లోంచి రోడ్డు మీదకు వస్తున్న గేదెను ఢీకొట్టింది. గేదె గాయపడగా కారులో ప్రయాణిస్తున్న వారికి త్రుటిలో ప్రమాదం తప్పింది.

రైల్వే ఉద్యోగికి సత్కారం



సాయిశంకర్ దంపతులను సత్కరించిన రైల్వే అధికారులు

సామర్లకోట: రైల్వేలో సుమారు 40 ఏళ్లపాటు సేవలందించిన సీనియర్ సెక్షన్ ఇంజినీరు దాసరి సాయిశంకర్‌ను ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలని రైల్వే ఏడీఎన్ శివ ప్రసాద్, రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ పేర్కొన్నారు. స్థానిక అన్నపూర్ణ కల్యాణ మండపంలో ఆయన పదవీ విరమణ సత్కార సభ జరిగింది. విధి నిర్వహణలో అంకితభావంతో పాటు సేవా గుణం కలిగిన ఆయనకు మంచి జరగాలని సహోద్యోగులు ఆకాంక్షించారు. రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్లు శ్రీధర్, శ్రీదేవి, అనంతలక్ష్మి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టరు కేవీ గిరి, సీనియర్ సెక్షన్ ఇంజినీర్లు తదితరులు దాసరి దంపతులను సత్కరించారు.

రేపటి నుంచి ఉచిత కుట్టు శిక్షణ

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయం వీధిలోని పెద్ద శివాలయం ఎదురుగా ఉన్న బచ్చు రామేశం సత్రంలో నిరుపేద మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమం మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు సత్రం చైర్మన్ ఫైండా రామకృష్ణరావు ఆదివారం తెలిపారు. రెండు బ్యాచ్‌లుగా ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఉదయం 10 నుంచి 1 వరకూ, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటలకు మహిళలకు అనుభవజ్ఞులైన వారితో శిక్షణ ఉచితంగా ఇస్తున్నామన్నారు.

దర్జీలకు చేతి నిండా పని

- జగనన్న విద్యాకానుక యూనిఫాంతో టైలర్లు బిజీబిజీ
- ఆనందం వ్యక్తం చేస్తున్న దర్జీలు

కొత్తపల్లి: ఒకప్పుడు పండగొచ్చినా, పబ్బమొచ్చినా కొత్త దుస్తులు కావాలంటే ప్రజలంతా టైలర్ల దగ్గరికే పరుగులు తీసేవారు. అయితే కాలక్రమేణా వచ్చిన మార్పులతో రెడీమేడ్ దుస్తుల రాకతో దర్జీల ప్రాభవం తగ్గుతూ వచ్చింది. దీంతో క్రమేపి టైలరింగ్ వృత్తిని చేపట్టేవాళ్లు తగ్గిపోయారు. ఇలాంటి తరుణంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టైలర్లకు ఒక్కొక్కరికి ఏటా రూ.10 వేలు అందిస్తూ ఆసరాగా నిలుస్తున్నారు. అంతేకాదు ప్రభుత్వం కొత్త రంగులతో జగనన్న విద్యాకానుక యూనిఫాం తీసుకురావడంతో మళ్లీ టైలర్లకు చేతి నిండా పని దొరికింది. వేల సంఖ్యలో విద్యార్థులు యూనిఫాం కుట్టించుకునేందుకు టైలర్లను ఆశ్రయిస్తుండడంతో దర్జీలు బిజీబిజీగా ఉంటున్నారు. జగనన్న విద్యాకానుకలో భాగంగా ప్రతి విద్యార్థికి మూడు జతల యూనిఫాం అందిస్తుండడంతో టైలర్లకు చేతి నిండా పని దొరుకుతుంది.

25,866 మంది విద్యార్థులకు దుస్తులు

పిఠాపురం నియోజకవర్గంలో సుమారు 600 మంది టైలరింగ్ వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఈ ఏడాది నియోజకవర్గంలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 25,866 మంది విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం మూడు జతల చొప్పున యూనిఫాం అందజేసింది. పాత యూనిఫాం స్థానంలో కొత్త రంగులతో వస్త్రం అందజేసింది. ప్రతి విద్యార్థికి యూనిఫాం కుట్టు కూలీ కోసం రూ.120 చొప్పున విద్యార్థుల తల్లి బ్యాంకు ఖాతాకు ప్రభుత్వం జమచేస్తోందని కొత్తపల్లి మండలం ఎంఈఓ వేణుగోపాల్ తెలిపారు. దీంతో వేల సంఖ్యలో విద్యార్థులు యూనిఫాం కుట్టించుకునేందుకు టైలరింగ్ షాపులకు క్యూ కడుతున్నారు. గతంలో కరోనా సమయంలోనూ పనిలేకపోతే జగనన్న విద్యాకానుక యూనిఫాంలే ఆదుకున్నాయని టైలర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వాకతిప్పలో యూనిఫాం కుడుతున్న టైలర్



యూనిఫాం కుడుతున్న టైలర్ వెంకటలక్ష్మి

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు



రెడీమేడ్ దుస్తుల రాకతో మాకు పని తగ్గిపోయింది. కాని గత నాలుగేళ్లుగా జగనన్న విద్యాకానుక యూనిఫాంలు మమ్మల్ని ఆదుకుంటున్నాయి. ఈ ఏడాది కూడా దుస్తులు కుట్టే పనిలో బిజీగా ఉన్నాం. టైలర్లకు పని కల్పిస్తున్నందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– అనుసూరి వెంకటలక్ష్మి, టైలర్, వాకతిప్ప

యూనిఫాంతో ఉపాధి



టైలర్లకు ఇప్పటికే ప్రభుత్వం ఏటా రూ.10 వేల ఆర్థిక సాయం చేస్తుంది. దీనికితోడు జగనన్న యూనిఫాం కుట్టు పనితో పిఠాపురం నియోజకవర్గంలో సుమారు 600 కుటుంబాలకు లబ్ధి చేకూరింది. టైలర్లంతా యూనిఫాం కుట్టే పనిలో బిజీగా ఉన్నారు.

– చిపూరి వెంకటరమణ, టైలర్, వాకతిప్ప

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలు

సామర్లకోట: మున్సిపాలిటీలో ప్రతి నెల నిర్వహిస్తున్న కౌన్సిల్ సాధారణ సమావేశంలో భాగంగా సోమవారం ఉదయం 11 గంటలకు సమావేశం జరుగుతుందని చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ తెలిపారు. పట్టణ అభివృద్ధికి సంబంధించి పొందుపరచిన అంశాలపై చర్చ ఉంటుందన్నారు. అధికార, ప్రతిపక్ష సభ్యులు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

పెద్దాపురం: పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన ఉంటుందన్నారు. కౌన్సిల్ సభ్యులు, ఆయా మున్సిపల్ విభాగాల అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

ఖురాన్ పఠన పోటీలు

కాకినాడ సిటీ: నగరంలోని జె.రామారావుపేట మక్కా మసీదు కమిటీ ఆధ్వర్యంలో మద్రాసా అరబియా హాబిబిలో చదువుతున్న పిల్లలకు ఖురాన్ పఠనం పోటీలు నిర్వహించారు. ఉత్తీర్ణులైన పిల్లలకు ఆదివారం బహుమతులను ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు అబ్దుల్ బషీరుద్దీన్ ముఖ్య అతిథిగా పాల్గొని ముస్లిం పిల్లలు ఇస్లాం మూలాలను, ఖురాన్ చదవడం నేర్చుకోవడం చాలా అవసరమన్నారు.

మరిడమ్మ దర్శనానికి కిటకిట



భక్తుల నుంచి పూజలందుకుంటున్న అమ్మవారు



అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు

- అమ్మను చూసేందుకు నాలుగు గంటల నిరీక్షణ
- వసతులు కల్పించిన తాత్కాలిక ఉత్సవ కమిటీ, ఈఓ

పెద్దాపురం: ఏటా ఆషాఢ మాసంలో నిర్వహించే మరిడమ్మ జాతరలో భాగంగా శ్రావణ మాసం మొదటి ఆదివారం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు భారీ క్యూ కట్టారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు భక్తులకు సౌకర్యాలు కల్పించారు. డీఎస్పీ లతాకుమారి ఆదేశాల మేరకు సీఐ అబ్దుల్ నబీ పర్యవేక్షణలో ఎస్ఐ వెలుగుల సురేష్ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ బందోబస్తు నిర్వహించారు. సుమారు లక్ష వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు అధికారులు అంచనా.

స్వచ్ఛంద సంఘాల ఆధ్వర్యంలో పులిహోర, పాలు పంపిణీ

స్థానిక స్వచ్ఛంద సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు ఆదివారం పులిహోర అందజేశారు. పెద్దాపురం బ్రాహ్మణ సేవా సంఘం, సామర్లకోట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో యాత్రికులకు ఉచితంగా పులిహోర పంపిణీ చేశారు.

రైతులకు మరింత సహకారం

- డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

పెద్దాపురం: రాష్ట్ర వ్యాప్తంగా సహకార సంఘాల ద్వారా ప్రభుత్వం రైతులకు మరిన్ని మెరుగైన సేవలు అందిస్తోందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు అన్నారు. మండలంలోని ఆర్‌బీ పట్నంలో నిర్మించిన సొసైటీ భవనాన్ని ఆదివారం ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబుతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు నల్లల నాగేంద్రబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో హౌసింగ్ చైర్మన్ దొరబాబుతో పాటు ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. దేశానికి వెన్నెముకగా పిలిచే రైతుకు అన్ని విధాల అండగా ఉంటూ రైతు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని దొరబాబు, వీర్రాజు కోరారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా మాట్లాడుతూ రైతులకు పలు పథకాల ద్వారా సబ్సిడీలు కల్పించి, సహకార సంఘాల ద్వారా రుణాలిచ్చి ఆదుకోవడం జరుగుతుందన్నారు. సహకార సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. తొలుత సుమారు రూ.55 లక్షలతో నిర్మించిన నూతన సొసైటీ భవనం, ఫిష్ మార్కెట్‌లను వారు ప్రారంభించారు. పులిమేరు సొసైటీ అధ్యక్షుడు గోపు నారాయణమూర్తి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు పుట్టా వెంకట్రావు, పరిమి శ్రీను, గ్రామ సర్పంచ్ చీకట్ల లక్ష్మి, గోలి రామారావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌బీపట్నం సొసైటీ భవనాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్, హౌసింగ్ చైర్మన్

సీఎం సంక్షేమ పాలన చేస్తున్నారు..

సామర్లకోట: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు అన్నారు. మండలంలోని పీబీ దేవంలో రూ.13 లక్షలతో నిర్మించిన కమర్షియల్ స్టోరేజ్ గోదామును ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూగడప గడపకూ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు పర్యటించే అవకాశం సీఎం కల్పించారని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో గుర్తించిన సమస్యల కోసం ప్రతి సచివాలయానికి కేటాయించిన రూ.20 లక్షలతో రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్టు ఈ కార్యక్రమంలో పాల్గొన్న దవులూరి తెలిపారు. సొసైటీ అధ్యక్షుడు మలకల వరాలబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పెద్దాపురం జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, ఎంపీటీసీ సభ్యులు మలకల సూరిబాబు, డాక్టరు వైవీబి ప్రభాకరరావు, పంచాయతీ సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, ఉపసర్పంచ్ మలకల సత్య తదితరులు పాల్గొన్నారు.



పీబీ దేవంలో సొసైటీ కమర్షియల్ స్టోరేజీ భవనాన్ని ప్రారంభించిన వీర్రాజు, దొరబాబు

మణిపూర్ ఘటన దేశానికే సిగ్గుచేటు

కొత్తపల్లి: మణిపూర్‌లో జరిగిన సంఘటన దేశానికే అవమానకరమని ఉప్పాడ, అమీనాబాద్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజు బాబు అన్నారు. మణిపూర్ ఘటనల్ని ఖండిస్తూ ఆదివారం అమీనాబాద్ సెంటర్ నుంచి ఉప్పాడ–పిఠాపురం రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి మణిపూర్‌లో తెగల మధ్య సయోధ్యను కుదిర్చి శాంతిని నెలకొల్పాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ప్రవీణ్ కుమార్, స్టీఫెన్ రాజు, జాషువా కన్నయ్య, కృపారావు, మోషే తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న అసోసియేషన్ సభ్యులు

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణ

సామర్లకోట: భక్తి శ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణ ప్రారంభమైంది. స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు దీనిని ప్రారంభించారు. పెద్దాపురం ధర్మ గీతా ప్రచారకుడు మల్లికార్జున స్వామి జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి పాల్గొన్న భక్త మండళ్ల సభ్యులను సన్మానించారు. పంచారామ క్షేత్ర ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు, సేవా సంస్థల ప్రతినిధులు భక్తులకు సేవలందించారు. నిత్యం సాయంత్రం 5 నుంచి 6.30 వరకు ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త పోల్నాటి గోవిందరావు సుందరకాండ, హనమాన్ వైభవం గురించి ప్రవచనాలు చేస్తారని నిర్వాహకులు తెలిపారు.



హనుమాన్ చాలీసా పారాయణ చేస్తున్న భక్తులు

మానవ వనరులతో అభివృద్ధి

కాకినాడ రూరల్: మానవ వనరుల అభివృద్ధి ద్వారానే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రీజినల్ కో ఆర్డినేటరు, రాష్ట్ర సివిల్ సప్లయిస్ డైరెక్టర్ జమ్ములమడక నాగమణి పేర్కొన్నారు. ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యను ప్రోత్సహించేందుకు సీఎం జగన్ అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలను ప్రారంభించడం ద్వారా ఎక్కువ మందిని వైద్యులుగా తీర్చిదిద్దే చర్యలు తీసుకున్నారన్నారు.

టమాటా కోసం ఇదీ వరస..!



గాంధీనగర్ రైతుబజార్‌లో టమాటాల కోసం క్యూ కట్టిన వినియోగదారులు

బోట్‌క్లబ్: టమాటాల కోసం గాంధీనగర్ రైతు బజార్‌లో భారీ క్యూలైన్ పెరిగింది. బహిరంగ మార్కెట్‌లో టమాటాలు కిలో రూ.180 నుంచి రూ.200 వరకూ విక్రయించడంతో ప్రజలు రైతు బజార్‌కు వస్తున్నారు. కిలో రూ.70కి విక్రయించడంతో ప్రజలు వీటిని కొనుగోలు చేసేందుకు వరసలో నిలబడి మరీ కొనుగోలు చేస్తున్నారు.

ఆహ్లాదం.. సాగర తీరం..



కడలి కెరటాలలో కేరింతలు కొడుతున్న పర్యాటకులు

కొత్తపల్లి: మండలంలోని కోనపాపపేటతో పాటు ఉప్పాడ తీర ప్రాంతం ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. వరుసగా మూడు రోజుల పాటు సెలవు రోజులు కావడంతో కొత్తపల్లి మండలం నుంచే కాకుండా పిఠాపురం, సామర్లకోట, గొల్లప్రోలు, కిర్లంపూడి, కత్తిపూడి, కాకినాడ తదితర ప్రాంతాల నుంచి కడలి కెరటాలలో కేరింతలు కొడుతూ ఆహ్లాదంగా గడిపారు. ఉప్పాడ నుంచి నేమాం వరకూ ఉన్న బీచ్‌రోడ్డులో పర్యాటకుల సంఖ్య మరింత పెరిగింది. పర్యాటకుల వాహనాలతో ఉప్పాడ–కాకినాడ బీచ్ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తీర ప్రాంతంలో ఎటువంటి వసతులు లేకపోవడంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.



ఉప్పాడ సాగర తీరంలో సందర్శకులు

పచ్చదనాల మట్టి నెత్తురోడింది..!



కవి సమ్మేళనంలో పాల్గొన్న స్రవంతి సాహితీవేత్తలు

- మణిపూర్ మృగక్రీడపై కవనాయుధం
- నగ్నత్వానికి ఇక భయపడక్కర్లేదని ఆక్రోశం
- మానవతను తట్టిలేపిన 'జన కవనం'

కాకినాడ కల్చరల్: అమానుష వికృత క్రీడకు ఆదివాసీ పచ్చదనాల మట్టి నెత్తురోడుతూ గాయాల పచ్చిదనాన్ని స్రవిస్తోందని.. నిశ్శబ్దపు కొండకోనల్లో తెగిపడిన ఆర్తనాదంలా మానవత్వం నగ్నంగా శిలువ వేయబడిందని.. అమాయకపు అడవిబిడ్డల దేహాలు ముష్కర చూపుల అగ్నిశిఖలపై ఖండ ఖండాలుగా వేలాడుతున్నాయని ప్రముఖ కవి మార్ని జానకిరామ్ చౌదరి మానవ మృగతృష్ణపై తన ఆక్రోశం వ్యక్తంచేశారు. మణిపూర్ ఆదివాసీ మహిళలపై జరిగిన దాడి అమానుషమని, యావత్ భారతదేశం సిగ్గు పడాల్సిన విషయమని యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు ప్రభాకరవర్మ అన్నారు. సాహితీ స్రవంతి, యూటీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కచేరిపేట యూటీఎఫ్ హోమ్ సమావేశ మందిరంలో ఆదివారం మణిపూర్ సంఘటనపై 'జనకవనం' పేరుతో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ వేదికపై పాల్గొన్న కవి మార్ని జానకిరామ్ చౌదరి తన కవిత ద్వారా ఆ రాష్ట్రంలోని అమానవీయ ఘటనలపై దండెత్తారు. అలాగే సిరికోనకు చెందిన సి.నాగజ్యోతి శేఖర్ తన కవిత వినిపిస్తూ.. ఇప్పుడిక నగ్నత్వానికి భయపడక్కరలేదు... నెత్తుటి తవ్వకాల్లో గర్భాలయాలు బయల్పడ్డాయి..! రహస్యావయవాలు చరిత్ర నడి రోడ్డుపై తెగిపడ్డాయి..! సిగ్గుతెర చింపబడ్డ నిండు ఆకాశం రెండు చేతులతో తనను దాచుకునే అవకాశం లేక నెత్తుటి వస్త్రాన్ని నేస్తూ సాలీడై నడివీధిలో వేలాడింది! జన్మస్థానం నుండి కిరాతకంగా తవ్వబడ్డ క(షా)సాయి నదిని స్రవిస్తూ దేశ పటాన్ని నింపుతోందంటూ రాజకీయ క్రీడను దునుమాడారు. కులమతాల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టే సంఘ విద్రోహుల కుట్రగా ఈ సంఘటనను స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గనారా అభివర్ణించారు. గరికిపాటి మాస్టారు, మధునాపంతుల సత్యనారాయణ, మేడిశెట్టి శ్రీరాములు, గౌరినాయుడు తదితరుల సమ్మేళనానికి హాజరై మణిపూర్‌లోని ఘటనలపై వారి కవితల ద్వారా మానవత్వాన్ని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఇంద్రగంటి నరసింహమూర్తి, ఇబ్రహీం, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఉపాధ్యాయులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

కోటలో భద్రత డొల్ల

- పేరుకే ప్రధాన రైల్వే జంక్షన్
- సౌకర్యాల కల్పనలో పక్షపాతం
- గతంలోనే లింక్ రైళ్ల తొలగింపు
- నేరగాళ్ల పలాయనానికి మార్గం సుగమం
- సీసీ కెమెరాల ఏర్పాటులో జాప్యం

సామర్లకోట: పేరు గొప్ప ఊరు దిబ్బ అనే సామెత స్థానిక రైల్వే స్టేషన్‌కు అతికినట్టు సరిపోతుంది. జిల్లా కేంద్రమైన కాకినాడకు ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వారు సామర్లకోట జంక్షన్ రైల్వే స్టేషన్‌లో దిగి వెళ్లాల్సి ఉంటుంది. గతంలో సామర్లకోట–కాకినాడకు లింక్ రైళ్లు ఉండేవి. దాంతో కాకినాడ వెళ్లాల్సిన వారు ఆయా రైళ్లలో కాకినాడ చేరుకునే వారు. రైల్వే శాఖ సామర్లకోట–కాకినాడ లింక్ రైళ్లను రద్దు చేసింది. దీంతో ఏలేశ్వరం, ప్రత్తిపాడు, కిర్లంపూడి, జగ్గంపేట, పెద్దాపురం, వేట్లపాలెం తదితర ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు సామర్లకోట వచ్చి రాక పోకలు సాగించాల్సి వస్తోంది. దీనికి తోడు ఉమ్మడి జిల్లాలో ఎక్కడా లేని విధంగా రైల్వేస్టేషన్, బస్సు కాంప్లెక్స్‌లు ఎదురెదురుగా ఉండటంతో నిత్యం రైల్వేస్టేషన్ సెంటర్ రద్దీగా ఉంటుంది. ప్లాట్‌ఫారాలపై తినుబండారాల విక్రయ స్టాల్స్ పెరిగినా పారిశుధ్య కార్మికుల సంఖ్య పెరగలేదు. రైల్వే ఉన్నతాధికారులు రాక పోకలు సాగించే సమయంలో మాత్రమే వాటిని ఆదరాబాదరగా శుభ్రంగా చేసేస్తారు.



రైల్వే స్టేషన్ ఆవరణలో నీడ లేని పార్కింగ్ స్టాండ్



సీసీ కెమేరాలు లేని ప్లాట్‌ఫాం



సామర్లకోట రైల్వే స్టేషన్

భద్రత కరువు..

ముఖ్య కూడలిలో ఉన్న ఈ రైల్వే స్టేషన్ నుంచి దొంగతనాలు చేసిన వారు సులువుగా తప్పించుకునే అవకాశాలు ఎక్కువ. ఈ క్రమంలో స్టేషన్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు విన్నవిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అలాగే ప్రస్తుత వర్షా కాలంలో సాధారణ ప్రయాణికులు వేచి ఉండే ప్లాట్‌ఫాంపై షెడ్లు లేకపోవడం వల్ల ప్రయాణికులు తడిసి ముద్దవుతున్నారు. అలాగే ఎండాకాలంలో మాడిపోతున్నారు.

నీడ లేని పార్కింగ్

రైల్వే స్టేషన్ పరిధిలో వాహనాల పార్కింగ్‌కు మూడేళ్లకు ఒకసారి బహిరంగ వేలం కమ్ టెండర్ నిర్వహిస్తారు. దీనిలో భాగంగా ప్రస్తుతం మూడేళ్లకు రూ.కోటి చెల్లించేలా పార్కింగ్‌కు అనుమతులు తీసుకున్నారు. అయితే స్టేషన్ ఆవరణలో పార్కింగ్ చేసిన వాహనాలు ఎండకు ఎండి, వానకు తడిసిపోతున్నాయి. ఈ ప్రాంతంలో షెడ్లు వేయడానికి రైల్వే అధికారులు అనుమతి ఉండాలి. మోటారు సైకిలు పార్కింగ్‌కు రూ.10, కారు పార్కింగ్‌కు రూ.30 వసూలు చేస్తున్నారు. ఈ స్టాండ్‌లో మోటారు సైకిలు చోరీకి గురి కావడంతో పాటదారుడే స్వయంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారు.


సీసీ కెమెరాలు ఉండాలి....



జిల్లాకు కూడలిలోని రైల్వే జంక్షన్ కావడం వల్ల ఇన్‌గేట్, అవుట్‌గేట్‌లతో పాటు స్టేషన్ ముఖద్వారం, మూడు ప్లాట్‌ఫాంలపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. ఇటీవల కాలంలో స్టేషన్ పరిధిలో నేరాల సంఖ్య పెరుగుతోంది. రెండో ఫుట్‌పాత్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలి.

– కాళ్ల లక్ష్మీనారాయణ, ప్రయాణికుడు, సామర్లకోట

త్వరలో చర్యలు తీసుకుంటాం



విజయవాడ రైల్వే ఉన్నతాధికారుల నుంచి 30 సీసీ కెమెరాల ఏర్పాటుకు అనుమతి లభించింది. వీటిని సీనియర్ సెక్షన్ ఇంజినీరు, టెలికం ద్వారా ఏర్పాటుకు చర్యలు తీసుకువాలి. వీటి మోనిటరింగ్ రైల్వే ఆర్పీఎఫ్ సిబ్బందికి అప్పగిస్తాం. ఈ మేరకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల కుదింపు వల్ల కొంత మేరకు పారిశుధ్య లోపం అనివార్యమవుతోంది.

– ఎం.రమేష్, స్టేషన్ మేనేజర్, సామర్లకోట